నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, శనివారం 31 మే 2025 | KARIMNAGAR


# 'కాళేశ్వరం'పై ఉత్తమ్‌కుమార్ పచ్చి అబద్ధాలు



- జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఏమిచ్చారు?
- రైతులకు వెంటనే వెంటనే రైతుభరోసా ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ కార్పొరేషన్, మే 30 : కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు వాడకుండా రికార్డు స్థాయిలో పంట పండించినట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రులు పచ్చి అబద్ధాలు మాట్లాడారని, ఇప్పటికైనా అలాంటివి మానుకోవాలని హితవుపలికారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్‌చార్జి మంత్రిగా జిల్లాకు ఏమైనా ఇచ్చారా?, కేవలం అబద్ధాలు మాట్లాడడం కోసం వచ్చారా? అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కేవలం రెండు పిల్లర్లకే పగుళ్లు వచ్చినంత మాత్రాన కూలిపోవడం అంటారా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ మంత్రులు కూలిపోయిందంటూ చేస్తున్న ప్రచారం మానుకోవాలని హితవుపలికారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఒక్కటై నీటిని పోలవరం దిక్కు వదులుతున్నారని ఆరోపించారు. 2022-2023లో మూడు కోట్ల మెట్రిక్ టన్నుల పంట పండిందని, దానికి ప్రధాన కారణం కాళేశ్వరం ప్రాజెక్టు అని పేర్కొన్నారు. మొన్న కరువు వచ్చేలా ఉందని మిడ్ మానేర్ నింపారని, ఆ నీరు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి కేసీఆర్‌ను బద్నాం చేయాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరంపై విమర్శలు చేయడం మాని వెంటనే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులను అరిగోస పెడుతున్నారని, ఇప్పటివరకు సుమారు 600 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అలాగే ఉందని, జీలుగు విత్తనాలు రాలేదని, రైతు భరోసా ఏమైందని ప్రశ్నించారు. వానకాలం పంటకు విత్తనాలు, ఎరువులు కొనే సమయం వచ్చిందని, కాంగ్రెస్‌కు రైతుల మీద చిత్తశుద్ధి ఉంటే వెంటనే రైతుభరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం మీద మరొకసారి అవాకులు చెవాకులు పేలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దేశానికి అన్నం పెట్టే స్థాయిలో హర్యానా, పంజాబ్‌కు దీటుగా తెలంగాణ ఉందని, దానికి కారణం కేసీఆర్ అని స్పష్టం చేశారు. రైతు బీమా రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. నారాయణపూర్ నిర్వాసితులకు వెంటనే పరిహారం ఇవ్వాలన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే తాము పని చేస్తామని, వందేళ్లయినా బీఆర్ఎస్ అలాగే ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, చొప్పదండి నియోజకవర్గ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కెనాల్‌పై తోడిన మట్టి పూడ్చివేత

- 'నమస్తే' కథనానికి స్పందన



'నమస్తే' కథనంతో ఎస్కవేటర్‌తో పూడ్చిన మట్టి

ఎల్లారెడ్డిపేట, మే 30: మల్కపేట కెనాల్ మట్టి తవ్వకాలకు బ్రేక్ పడింది. కట్టపై ఉన్న మట్టిని రాత్రిళ్లు తవ్వేస్తూ, గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారని పేర్కొంటూ 'మట్టి కోసం కట్ట తవ్వి' అనే శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. కాల్వను తవ్వి మట్టిని తీసిన స్థలంలో ఏర్పడిన గోతులను పరిశీలించి పూడ్చివేయించింది. అలాగే మరో చోట కెనాల్‌ను ఆనుకొని ఉన్న పొలంలో ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తీస్తున్న స్థలానికి 9వ ప్యాకేజీ ఏఈ వెంకట్‌రెడ్డి, లస్కర్ సుధాకర్‌తో కలిసి వెళ్లారు. కాల్వ వెడల్పు 50 మీటర్లు ఉంటుందని ప్రతి చోట కాల్వ గట్టుకు సుమారు 2 నుంచి 3మీటర్ల దూరం వరకు స్థలం కాల్వకు సంబంధించిందేనని, ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సదరు రైతుకు సూచించారు. ఎవరైనా కాల్వపక్కన మట్టిని తీస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, కొన్ని చోట్ల వర్షానికి కాల్వగట్టుపై ఉన్న మట్టి కొట్టుకుపోయిందని, వెంటనే మరమ్మతులు చేయించాలని రైతులు కోరారు.

# బెస్ట్ అవైలబుల్ అమలుకు నిధులేవి?



- స్కీం అమలు చేయలేం అంటున్న ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు
- తప్పుకునేందుకు సిద్ధమంటూ వెల్లడి
- నిధులు రాకపోవడం, బిల్లులు పాస్ కాకపోవడంతో ఇబ్బందులు
- రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది పిల్లలపై ప్రభావం
- కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఇక గరీబు పిల్లలకు చదువు నాస్తే..

స్వరాష్ట్రంలో దశాబ్దం పాటు శ్రమించి, విద్యారంగాన్ని సంస్కరిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పదహారు నెలల కాలంలోనే విద్యారంగాన్ని భ్రష్టుపట్టించి, నిర్వీర్యం చేసే దుస్థితికి తీసుకువచ్చింది. వందలాది సంక్షేమ గురుకులాలు, జూనియర్, డిగ్రీ కాలేజీలు, మెడికల్ కాలేజీలు, కస్తూర్బా పాఠశాలలను ఏర్పాటు చేసి, లక్షలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిన స్థితి నుంచి నేడు కనీసం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకంలో నిరుపేద పిల్లలకు పాఠాలు చెప్పించలేని దైన్యస్థితికి తీసుకొచ్చింది. బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌లో భాగంగా పిల్లలకు విద్య, వసతిని అందించిన ప్రైవేట్ యాజమాన్యాలు దాదాపు పదహారు నెలలుగా నిధులు రాకపోవడంతో పథకం నుంచి తప్పుకునేందుకు సిద్ధమయ్యాయి. ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చి చెప్పగా, ఇదే జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది నిరుపేద విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది.

జగిత్యాల, మే 30(నమస్తే తెలంగాణ) : విద్యాహక్కు చట్టం 2009ని అమలు చేయలేమని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఇటీవల తేల్చి చెప్పాయి. 2009లో దేశ వ్యాప్తంగా విద్యా హక్కు చట్టం 2009న ప్రభుత్వం ఆమోదించింది. 2009 ఆగస్టు 4న జాతీయ పార్లమెంట్ ఈ చట్టాన్ని అమలు చేసింది. విద్యా వ్యవస్థకు సంబంధించిన పలు అంశాలతో ఈ చట్టం జారీ అయింది. 6-14 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న పిల్లలందరికీ విద్య హక్కుగా ఈ చట్టం పేర్కొంది. అలాగే, పిల్లల చదువులకు సంబంధించిన మౌలిక వసతుల కల్పన అంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొంది. ఈ చట్టాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలు 2010 ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి తెచ్చాయి. ఈ చట్టంలో పదో అంశంగా ప్రభుత్వ పాఠశాలలతోపాటు, కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లోనూ నిరుపేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ప్రవేశాలు కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్లను బడుగు, బలహీనవర్గాల వారికి రిజర్వు చేయాలని చట్టంలో పొందుపర్చారు. చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు చట్టంలోని పదో అంశాన్ని వ్యతిరేకించాయి. తాము 25 శాతం సీట్లు కేటాయించలేమని స్పష్టం చేశాయి. ఈ విషయమై ప్రభుత్వం, ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల మధ్య తకరారు ఏర్పడడంతో ప్రైవేట్ విద్యా సంస్థలు న్యాయస్థానాలను ఆశ్రయించాయి. చాలా సంవత్సరాల పాటు ఈ అంశంపై న్యాయస్థానాల్లో వివాదం కొనసాగింది. 25 శాతం సీట్లు, బడుగు, బలహీన, గిరిజన వర్గాల పిల్లలకు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు రిజర్వు చేయాల్సిందేనని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అదే సమయంలో ప్రైవేట్ విద్యా సంస్థలు కేటాయించిన 25 శాతం సీట్లకు సంబంధించిన ఫీజులను రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాలని సూచనలు చేసింది. న్యాయస్థానాల ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ, ప్రైవేట్ విద్యా సంస్థల మధ్య చర్చలు జరిగాయి. నిబంధనల ప్రకారం 25 శాతం సీట్లలో భర్తీ అయిన పిల్లలకు సంబంధించిన ఫీజులు చెల్లిస్తామని విద్యా శాఖ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యానికి హామీ ఇచ్చింది. అయితే, ప్రభుత్వ చెల్లింపులపై నమ్మకం లేని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యాహక్కు చట్టం 2009ని తాము అమలు చేయలేమని, ప్రభుత్వ చెల్లింపులపై తమకు నమ్మకం లేదని పేర్కొంటూ, విద్యాశాఖ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా తెలియజేసింది

## చిక్కుల్లో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగానికి ఇబ్బందికర పరిస్థితులు దాపురించాయి. ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను మంజూరు చేయకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలు చావుకు దగ్గరయ్యాయి. ఈ నేపథ్యంలోనే రెండేండ్లుగా రీయింబర్స్‌మెంట్ రావడం లేదని, కాలేజీలు నడపలేమంటూ, పరీక్షలను సైతం బాయికాట్ చేసి నిరసనలు తెలుపుతున్న విషయం తెలిసిందే. ఇక ప్రాథమిక విద్యా రంగంలో బెస్ట్ అవలెబుల్ స్కూల్స్‌కు సైతం దాదాపు రెండేండ్లుగా నిధుల మంజూరు లేకపోవడంతో ఆ పథకం సైతం ముగిసిపోయి నిరుపేద పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడే దుస్థితి తలెత్తింది. 2014కు ముందే కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టపరిచే ఉద్దేశంతో జవహర్ నవోదయ విద్యాలయ పథకాన్ని రూపొందించింది. నిరుపేదలైన బడుగు, గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ఆర్థిక సాయం అందించడం దీని ఉద్దేశం. ఈ పథకాన్ని ఇటీవల ప్రధానమంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా స్కీమ్ పరిధిలోకి తీసుకువచ్చారు. ప్రతి జిల్లాలో బెస్ట్ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను ప్రభుత్వం గుర్తిస్తుంది. ఈ పాఠశాలల్లో బడుగు, గిరిజన విద్యార్థులకు అడ్మిషన్లను కల్పిస్తుంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు, బోధన, వసతికి సంబంధించిన డబ్బును ప్రభుత్వం చెల్లిస్తుంది. షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులకు 1వ తరగతి, 5వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తారు. ఇక గిరిజన విద్యార్థులకు సంబంధించి, 1, 5, 8వ తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. జగిత్యాల జిల్లాలో షెడ్యూల్ కులాలకు సంబంధించి ప్రాథమిక తరగతులకు సంబంధించి ప్రతి విద్యా సంవత్సరం 75 మంది విద్యార్థులకు, ప్రాథమికోన్నత తరగతులకు సంబంధించి 76 మందికి అవకాశం కల్పిస్తున్నారు. గిరిజన విభాగంలో 30 మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. బెస్ట్ అవలెబుల్ స్కూల్స్‌లో ప్రవేశం పొందే విద్యార్థులకు సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖలు సామర్థ్య పరీక్షను నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తున్నాయి. ఎంపికైన ప్రాథమిక తరగతి విద్యార్థికి ఏడాదికి రూ.28,000లు, ప్రాథమికోన్నత తరగతుల విద్యార్థులకు (వసతితో కలిపి) రూ.42,000లు చెల్లిస్తున్నారు. ప్రాథమికోన్నత విద్యను చదివే విద్యార్థి వసతి గృహంలో ఉండడానికి ఇష్టపడకపోతే అతడికి ఫీజుగా రూ.28 వేలు చెల్లిస్తున్నారు. గిరిజన విభాగంలోనూ ఇదే పద్ధతిని అవలంభిస్తున్నారు. ప్రస్తుతం 500లకు పైగా షెడ్యూల్ కులాల విద్యార్థులు, వందకుపైగా గిరిజన విభాగ విద్యార్థులు బెస్ట్ అవలెబుల్ స్కూల్స్‌లో విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే, వీరికి సంబంధించి డబ్బులను చెల్లించకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందిపడుతున్నాయి.

## 16 నెలలుగా చెల్లింపులు శూన్యం

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 16 నెలలుగా బెస్ట్ అవలెబుల్ స్కూల్స్ స్కీమ్‌కు సంబంధించిన డబ్బులను చెల్లించలేదు. ప్రతి ఏడాది షెడ్యూల్ కులాలకు సంబంధించిన ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థులకు కలిపి రూ.53 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, గిరిజన విభాగానికి చెందిన విద్యార్థులకు ఏటా రూ.10 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, దాదాపు రెండేండ్లుగా ప్రైవేట్ యాజమాన్యాలకు ప్రభుత్వం చెల్లింపులు జరపలేదు. ప్రస్తుతం రెండు విద్యా సంవత్సరాలకు సంబంధించిన డబ్బులను ప్రభుత్వం ప్రైవేట్ యాజమాన్యాలకు బకాయిపడింది. పలుమార్లు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, జిల్లా కలెక్టరేట్‌ని ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయం చుట్టూ తిరిగితిరిగి వేసారి పోతున్నాయి. నిధుల చెల్లింపు విషయం తమ పరిధిలో లేదని, తాము ఏమీ చేయలేమని సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ 16 నెలల కాలంలో రూ.లక్షకు తక్కువగా ఉన్న బిల్లులు మాత్రమే పాస్ అయ్యాయని, అంతకు మించిన బిల్లులు పాస్ కావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

## అడ్మిషన్లు నిరాకరిస్తామంటున్న యాజమాన్యాలు

బెస్ట్ అవలెబుల్ స్కీమ్ కింద తమ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, వసతి, భోజనం, విద్యను పొందుతున్న ప్రభుత్వాలు, తమకు నిధులను కేటాయించడానికి ససేమిరా అంటుండడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నాలుగేండ్ల క్రితం వరకు బెస్ట్‌అవలెబుల్ స్కూల్‌గా గుర్తింపు పొంది, ప్రభుత్వం నిర్దేశించే పిల్లల అడ్మిషన్లు పొందేందుకు జిల్లాలోని పలు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పోటీపడ్డాయి. ఒకానొక దశలో విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్చుకునేందుకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల వద్ద ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పైరవీలు చేసిన సందర్భాలూ ఉన్నాయి. అయితే, నేడు పరిస్థితి మారిపోయింది. ప్రభుత్వం పిల్లలకు సంబంధించిన బోధన, వసతి, భోజన రుసుంలను మంజూరు చేయకపోవడంతో బెస్ట్ అవలెబుల్ స్కూల్స్ లిస్టు నుంచి బయటకు వెళ్లిపోతున్నాయి. జగిత్యాల జిల్లాలో గతంలో పది వరకు గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, ప్రస్తుతం కేవలం 3పాఠశాలలు మాత్రమే జాబితాలో ఉండడం గమనార్హం. ఆ మూడు పాఠశాలలు సైతం జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందినవి కావంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కాగా, ప్రభుత్వం డబ్బుల చెల్లింపులు జరపకుండా ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో గతంలో తమ వద్ద అడ్మిషన్ పొంది చదువుకుంటున్న విద్యార్థులను సైతం వసతిగృహాలతోపాటు, పాఠశాలల నుంచి తొలగించాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఉన్నతాధికారులకు సమాచారం సైతం ఇచ్చినట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి.

## ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రభుత్వ నిర్లక్ష్యం, నిధుల చెల్లింపులో ఇబ్బందులు సృష్టించే ప్రక్రియ వల్ల నిరుపేదలైన బడుగు, గిరిజన వర్గాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా మారిందని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఆశలతో చదువుకుంటే ప్రభుత్వం నీళ్లు పోస్తున్నదని వాపోతున్నారు. చిన్నారుల చదువు, భోజనానికి సంబంధించిన డబ్బులను కనీసం చెల్లించలేని ఈ ప్రభుత్వం ఎందుకు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బెస్ట్ అవలెబుల్ స్కీమ్ డబ్బులు చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలని, అలాగే విద్యాహక్కు చట్టం 2009కి సంబంధించిన 25 శాతం సీట్లను సైతం కల్పించేందుకు నిధులను ముందే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఉపయోగం లేని ఉమ్మడి జిల్లా సమీక్ష

- ఎన్నికల సభలో వాగ్దానాలు చేసినట్టు మంత్రుల మాటలు
- అసలైన నిరుపేదలకు అందని ఇందిరమ్మ ఇండ్లు
- గోదావరి నీళ్లు తరలించుకుపోతున్నా ఇరిగేషన్ మంత్రికి సోయిలేదు
- బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ ధ్వజం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, మే 30 : కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్షతో జిల్లా ప్రజలకు ఎలాంటి ఉపయోగమూ లేదని బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదని, వారి మాటల తీరు కేవలం ఎన్నికల సభలో వాగ్దానాలు చేసినట్టు ఉందని ఎద్దేవా చేశారు. శుక్రవారం మానకొండూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి హెలీకాప్టర్‌లో వచ్చి వెళ్తే ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయని చురకలంటించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించాలని ఇటీవల మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే కేవలం తూతూ మంత్రంగా నిర్వహించారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ఇండ్ల కేటాయింపులో అసలైన నిరుపేదలకు అన్యాయం జరిగిందన్నారు. సిబిల్ స్కోర్ ఉంటేనే రాజీవ్ యువశక్తి పథకానికి అర్హులని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సిబిల్ స్కోర్ ఉంటే బ్యాంకర్లే ఇంటి వద్దకు వచ్చి లోన్లు ఇస్తారు కదా? అని చెప్పారు. దరఖాస్తు సమయంలో ఈ నిబంధన ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. రాజీవ్ యువశక్తి కేవలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకే ఇస్తున్నారని, నిరుద్యోగులు, యువతను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం కొనాలని అధికారులకు మంత్రులు సూచించలేదని, విత్తనాలు, ఎరువుల కొరతపై ఎందుకు చర్చించలేదని, రైతు భరోసాపై ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అద్భుతమని సుప్రీంకోర్టు న్యాయ మూర్తులు ప్రశంసించినా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుపై అనవసర రాద్ధాంతం చేస్తూ రైతుల ఉసురు తీస్తున్నదని మండిపడ్డారు. కాళేశ్వరంను ఎండబెట్టి గోదావరి నీళ్లు ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నా ఇరిగేషన్ మంత్రికి సోయిలేదని దుయ్యబట్టారు. ఉమ్మడి జిల్లాలో ఇసుక మాఫియా జోరుగా సాగుతున్నదని, కమీషన్లు, వాటాల కోసం కాంగ్రెస్ నేతలు కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్ఎస్వీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ గుర్రం కిరణ్‌గౌడ్, నాయకులు శాతరాజు యాదగిరి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, పిట్టల మధు, దండబోయిన శేఖర్, బోడ రాజశేఖర్ పాల్గొన్నారు.

# ట్రాక్టర్‌తో బావిలో పడి

## పొలాన్ని చదును చేస్తూ..

మల్లాపూర్‌లో ఒకరి మృతి



పెద్దులు (ఫైల్)

మల్లాపూర్, మే 30: పొలాన్ని చదును చేస్తూ .. ట్రాక్టర్‌తో సహా బావిలో పడి ఒకరు మృతిచెందిన ఘటన మల్లాపూర్‌లో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాట్ల చిన్న పెద్దులు (61) తన సొంత ట్రాక్టర్‌ను నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని ఎల్లమ్మ చెరువు దగ్గర ఓ రైతుకు సంబంధించిన వ్యవసాయ భూమిని చదును చేసేందుకు వెళ్లాడు. లెవలింగ్ పనులు మొదలు పెట్టిన కాసేపటికే రివర్స్ వెళ్లే క్రమంలో పక్కనే వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌తో సహా జారీ పడిపోయాడు. తల కిందులుగా ట్రాక్టర్ బావిలో పడిపోవడంతో ఉపిరాడక పెద్దులు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రాజు పరిశీలించారు. పెద్దులు భార్య సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉపాధి కూలీల ధర్నా




ఓదెల: ఎంపీడీవో ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

ఓదెల, మే 30 : మండలంలోని ఈజీఎస్ పథకంలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ తీరును నిరసిస్తూ ఉపాధి కూలీలు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ డీ-86 కాల్వలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. అయితే, ఈ పనులు చేయడానికి వర్క్ ఐడీ భీమరపల్లి గ్రామ కూలీలకు ఇచ్చారు. అదే పనిని తిరిగి జీలకుంట కూలీలకు కూడా ఇచ్చారని, దీంతో రెండు గ్రామాల కూలీల మధ్య గొడవలు వస్తున్నాయని, ఈ విషయం గురించి టీఏ జనార్ధన్‌ను అడిగితే తమనే బెదిరిస్తున్నట్లు కూలీలు తెలిపారు. టీఏ తీరును నిరసిస్తూ కూలీలు భీమరపల్లి గ్రామం నుంచి కాలినడకన వచ్చి ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేయడంతో పాటు ఫిర్యాదును అందించారు. కూలీలపై దురుసుగా ప్రవర్తించిన టీఏపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఈ- శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలి

కొత్తపల్లి, మే 30 : ఫుడ్ డెలివరీ, హోమ్ సర్వీసెస్, కొరియర్ సర్వీసెస్, ఏసీ టెక్నీషియన్స్, గ్రాఫిక్ డిజైనర్స్, వీడియో ఎడిటర్స్, ఉబర్ ఓలా, ర్యాపిడో, స్విగ్గీ, జొమాటో మొదలగు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో పనిచేసేవారు తప్పనిసరిగా ఈ శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని బీడీ దవాఖాన సీనియర్ వైద్యాధికారి టీ అనూషరాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోర్టల్‌లో నమోదైన కార్మికులకు ప్రభుత్వం అమలు చేసే సాంఘిక సంక్షేమ పథకాలు వీరికి వర్తిస్తాయన్నారు. సీఎస్సీ సెంటర్ల ద్వారా ఈ శ్రమ్‌లో నమోదు చేసుకోవడం ద్వారా యూనిక్ గుర్తింపు కార్డు పొందవచ్చున్నారు.

# జమ్మికుంట యువతపై 'నార్కోటిక్స్' ఫోకస్?



- గంజాయి, డ్రగ్స్ తీసుకుంటున్నట్లు ఆరోపణలు, ఫిర్యాదులతో రంగంలోకి!
- ఇటీవల ఓ గ్రామంలో కౌన్సెలింగ్
- యువకుల ఫోన్ నంబర్ల సేకరణ, పనితీరుపై ఆరా
- కాల్ డేటాపైనా నిఘా..?
- పట్టణంలో కలకలం

మత్తులో చిత్తవుతూ, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న జమ్మికుంటలో పలువురు యువతపై కీలకమైన 'నార్కోటిక్స్' నిఘా పెట్టింది. గంజాయి, డ్రగ్స్, తదితర మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారనే ఆరోపణలు.. కట్టడి చేయాలంటూ ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదుల నేపథ్యంలో రంగంలోకి దిగినట్లు తెలిసింది. సదరు అధికారుల బృందం పట్టణంతో పాటు మండలంలోని ఓ గ్రామంలోని కొందరు యువకుల పని తీరు, వ్యవహారశైలిపై ఆరా తీయడమేకాదు, పలువురికి కౌన్సెలింగ్ ఇస్తూ.. 'మత్తు' పదార్థాల దందాపై హెచ్చరికలు జారీ చేసినట్లు ప్రచారం సాగుతున్నది. కొందరి ఫోన్ నంబర్లతో పాటూ కాల్‌డేటా, తదితర టెక్నికల్ అంశాలపై ఫోకస్ పెట్టి కూపీ లాగుతున్నట్లు తెలుస్తుండగా, సర్వత్రా కలకలం రేపుతున్నది.

- జమ్మికుంట, మే30

జమ్మికుంట, మే30: యువత మత్తు వలయంలో చిక్కుకున్నదా..?, అడ్డూఅదుపులేకుండా వ్యవహరిస్తున్నదా..? అంటే అవుననే సమాధానాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. అందుకు కారణాలు కూడా అనేకంగా ఉన్నాయని తెలుస్తున్నది. మున్సిపల్ పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన యువకులు కొందరు గంజాయి, డ్రగ్స్‌ను వాడుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతున్నది. డబ్బు, పలుకుబడి ఎక్కువగా ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు అధికారులెవరూ పట్టించుకోకపోవడం సదరు యువకులకు మరింత బలం చేకూరినట్లయింది. ఒకానొక దశలో అధికారులను తిడుతూ, దాడులు చేసే వరకు వెళ్లిందనే ప్రచారం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే మండలంలోని మరో గ్రామంలో ఓ బ్యాచ్ సంచారం అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని తెలిసింది. దొంగతనాలు, మహిళల పట్ల అసభ్య ప్రవర్తన చేస్తున్నట్లు తెలుస్తుండగా, ఈ విషయం ఠాణా వరకు వెళ్లకుండా ఓ వర్గం అడ్డుకుంటున్నట్లు సమాచారం. ఎక్కడికక్కడే సెటిల్‌మెంట్ చేయడం, ఈ క్రమంలో శాంతిభద్రతలు అదుపుతప్పే పరిస్థితులు నెలకొన్నాయని చర్చ సాగుతున్నది. ఇంత జరుగుతున్నా ఆ గ్రామ అధికారులు, సిబ్బంది ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నలా ఉంది.

## రంగంలో 'నార్కోటిక్'

'మత్తు'కు బానిసైన యువత నేరాలు చేసే దిశగా సాగుతున్నదని, మాదకద్రవ్యాలను కట్టడి చేస్తూ, యువతను సన్మార్గంలో పెట్టాలని కోరుతూ ఇటీవల సామాజిక కార్యకర్త శ్రీకాంత్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదుల నేపథ్యమో లేక అధికారులకున్న సమాచారమో తెలియదు కానీ, జమ్మికుంటలో ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలపై నార్కోటిక్స్ టీం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. అంతే కాకుండా వెంటనే రంగంలో దిగినట్లు సమాచారం. ఇక్కడి యువత గంజాయి, డ్రగ్స్, తదితర మత్తు పదార్థాలు తీసుకుంటున్నదా..? తీసుకుంటే.. ఎక్కడి నుంచి సరఫరా జరుగుతున్నది..? ఎవరి ప్రమేయం ఎంత..? అనే అంశాలపై అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. పలువురు యువకుల పేర్లు సేకరించి, వారిపై నిఘా పెట్టినట్లు వినికిడి. ఏది ఏమైనా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని, నార్కో అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తులున్నాయి.





